క్లుప్తంగా

తాళ్లపూడిలో 100 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

తాళ్లపూడి: స్థానిక సొలస దయమంతి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ, నందన ఫౌండేషన్, జనహిత సేవాసమితి, దేవోక్తి సోషల్ సర్వీస్, తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. మానవత సంస్థ మండల శాఖ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా 100 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు, పండ్లు, ఓఆర్ఎస్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐవో జె.వెంకటేశ్వరావు, దేవరపల్లి రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జేవీ ప్రమోద్ కుమార్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

నిడదవోలు: ఆర్య వైశ్యుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణాభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడిని స్థానిక కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతో నిడదవోలును మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్యుల వ్యాపారాల అభివృద్ధికి అండగా ఉంటూ, తన వంతు తోడ్పాటు అందిస్తామన్నారు.కార్యక్రమంలో పూసరపు వెంకటేశ్వరరావు, పచ్చిపులుసు ఆదినారాయణ, పచ్చిపులుసు రామారావు, సంక కృష్ణ, మాజేటి నరసింహమూర్తి, మడిపల్లి భాస్కరం, చిలకల మల్లికార్జునరావు, గ్రంధి బాలాజీ, బచ్చు సుమన్, ఆలమూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రక్కిలంకలో జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తాళ్లపూడి: గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని వేగేశ్వరపురం, ప్రక్కిలంక సచివాలయాల వద్ద సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి సచివాలయ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబురావు, విత్తం నాని, సచివాలయ ఉద్యోగులు నాగాంజనేయులు, కుమారి, సురేష్, సతీష్, శ్యామ్ ప్రసాద్, మణికంఠ, కవిత, వలంటీర్లు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నేడు

దేవరపల్లి: గౌరీపట్నం శివారు కొండగూడెంలో జగనన్న శాశ్వత భూ సర్వేకు డ్రాఫ్ట్ తయారైనట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ సోమవారం తెలిపారు. దీనిపై మంగళవారం ఉదయం 9 గంటలకు ఆ గ్రామ సచివాలయం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 400 మంది రైతులకు చెందిన 825 ఎకరాల భూమి వివరాలను ప్రచురించే విషయమై ఈ గ్రామ సభ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వివరించారు. డ్రాఫ్ట్‌పై రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా సభకు హాజరై నివృత్తి చేసుకోవాలని సూచించారు. గ్రామ సభకు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు గోపవరంలో ప్రత్యేక వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోపవరం గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ సోమవారం తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని ఆయన చెప్పారు.

కాపవరంలో..

కొవ్వూరు: కాపవరంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు



సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ పైడి శిరీష, ఉప సర్పంచ్, కార్యదర్శి

బాపూజీ గ్రామ స్వరాజ్యం జగన్ సాకారం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు
- పలుచోట్ల ర్యాలీలు
- పారిశుధ్య కార్మికులకు సన్మానం



నిడదవోలు గాంధీ బొమ్మ సెంటర్లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయాల వ్యవస్థను తీసుకు వచ్చారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జాతిపిత గాంధీ జయంతి వేడుకలను సోమవారం వాడవాడలా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలోని, స్థానిక గాంధీబొమ్మ సెంటర్లోని గాంధీజీ విగ్రహానికి శ్రీనివాస్‌నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిషనర్ పద్మావతితో పాటు పలువురు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం వద్ద గల ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, కార్యాలయ ఏఓ రత్నరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు సర్పంచులు, ఎంపీటీసీలు సభ్యులు, వార్డుసభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నివాళులర్పించారు.

ఆసుపత్రిలో పండ్లు, ఆహారం పంపిణీ

కొవ్వూరు: గాంధీ జయంతి సందర్భంగా మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో బాలింతలకు, రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ తీగెల రవికుమార్, మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మల్లిపూడి ధనరాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం పట్టణ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పడాల గంగధారరావు, దగ్గు రాధాకృష్ణ, బీర రవి తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని కాపవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్, మండల శాఖ అధ్యక్షుడు సాకా పుల్లారావు, మట్టా సుబ్బారావు, యూత్ అధ్యక్షుడు ఐ.సుబ్రహ్మణ్యం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొవ్వూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరిగెల అరుణకుమారి ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి పంచాయతీ కార్మికులను సామూహికంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక చెత్త శుద్ధి సంపద తయారీ కేంద్రం వద్ద ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాకుళపు ఆంజనేయులు ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్ ఆవిష్కరించారు. చాగల్లు ప్రధాన కూడలిలో ఆర్యవైశ్య సంఘ నాయకులు గ్రంధి రాంబాబు ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. బ్రాహ్మణగూడెం మెయిన్ రోడ్‌లోని గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లవరంలోని ఆనంద నికేతన్ గాంధీ గ్రామ సేవ కేంద్రంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

గోపాలపురం: గాంధీ జయంతి సందర్భంగా గోపాలపురంలో సర్పంచ్ పైడి శిరీష ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అలాగే గోపాలపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఎంపీపీ బంక జయలక్ష్మి పూలమాల వేశారు. అక్కడి అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈటీపీఆర్డీ సింహాద్రి, ఉపాధి హామీ ఉద్యోగులు పాల్గొన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాపూజీ జయంతి వేడుకల్లో జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, గుత్తికొండ ప్రసాద్, గుళ్ళపూడి వెంకటరత్నం పాల్గొన్నారు.

పెరవలి: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సూర్యభగవాన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద బాపూజీకి నివాళులు అర్పించారు. పారిశుద్ధ్య ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు.

ఉండ్రాజవరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ళ శ్రీనివాసు బాపూజీ చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. పాలంగిలో శ్రీవాసవీమాత ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలోను, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పద్మావతి, సచివాలయాల వద్ద ఆయా సర్పంచులు గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విధుల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తాం

- సిబ్బందితో ఏడీఈ అచ్యుతాచారి
- విద్యుత్తు శాఖ భద్రతా వారోత్సవాలు



కొవ్వూరు విద్యుత్తు శాఖ కార్యాలయంలో సిబ్బందితో భద్రతా ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఈ అచ్యుతాచారి

కొవ్వూరు: విధి నిర్వహణలో విద్యుత్తు సిబ్బంది కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని ట్రాన్స్‌కో కొవ్వూరు ఏడీఈ పి.అచ్యుతాచారి సూచించారు. విద్యుత్తు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన స్థానిక విద్యుత్ శాఖ డీ–1 కార్యాలయం వద్ద భద్రత ప్రమాణాలను పాటిస్తామంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యుత్తు భద్రతా చర్యలను వివరించే బ్యానర్లు, ఫ్లకార్డులు పట్టుకుని సిబ్బంది స్థానిక విజయవిహార్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్తు ఉపకరణాల వినియోగంలో ప్రతి ఒక్కరూ భద్రతా చర్యలు పాటించాలంటూ నినాదాలు ఇచ్చారు. ట్రాన్స్‌కో పట్టణ ఏఈ జగదీశ్వరరావు, రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక సబ్ స్టేషన్ వద్ద ట్రాన్స్‌కో ఏఈ వెంకటరావు విద్యుత్ క్షేత్ర స్థాయి సిబ్బందికి భద్రతా సూచనలు చేశారు. విధి నిర్వహణలో భద్రత పాటిస్తామంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రక్కిలంక, అన్నదేవరపేట, మలకపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లజర్ల: విద్యుత్తు ఉద్యోగులు, షిఫ్ట్ ఆపరేటర్లు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాన్స్‌కో ఏడీఏ రాజబాబు అవగాహన కల్పించారు. నల్లజర్లలోని సబ్ డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతపల్లి ఏఈ బాపిరాజు, నల్లజర్ల సబ్ ఇంజినీరు నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: విధి నిర్వహణలో ఉద్యోగులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిడదవోలు డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.శ్రీధర్ సూచించారు. మండలంలోని మోర్త సబ్‌స్టేషన్ వద్ద సోమవారం భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ నిడదవోలు దొరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నియమాలు పాటిద్దాం–భద్రతకు స్వాగతం పలుకుదాం, ప్రమాదాలకు స్వస్తి పలుకుదాం అంటూ నినాదాలతో ప్రతిజ్ఞ చేయించారు.

'రవళి'లో ఏర్పాట్లు పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

4న సీఎంచే స్పిన్నింగ్ మిల్లు విస్తరణకు శంకుస్థాపన



స్పిన్నింగ్ మిల్లులో ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డితో అధికారులు, ఎండీలు

పెరవలి: ఖండవల్లి గ్రామంలోని రవళి స్పిన్నింగ్ మిల్లు విస్తరణ పనులను ఈ నెల 4న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభిస్తారని ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ట్రైనీ కలెక్టర్ సోమవారం రవళి స్పిన్నింగ్ మిల్లుకు వెళ్లి విస్తరణ పనులను, సమావేశ మందిరాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ స్పిన్నింగ్ మిల్లులో రూ.150 కోట్లలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ రోటరీ స్పిన్నింగ్ వీరింగ్ కంపెనీ స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశ్రమ విస్తరణ వలన సుమారు వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే ప్రస్తుతం నిర్వహిస్తున్న స్పిన్నింగ్ మిల్లు నుంచి ఇకపై వేస్టేజీ కూడా రాదన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ రవళి స్పిన్నింగ్ మిల్లు డైరెక్టర్ వంక రఘువీర్, కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబులతో వర్చువల్ సమావేశానికి తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి. రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, రవళి స్పిన్నింగ్ భాగస్వాములు బి. రాజశేఖర్, గంధం వీరరాఘవులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడి మృతి



మృతుడు షేక్ ఇస్మాయిల్

పెరవలి: పెరవలి మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ముస్లిం నేత షేక్ ఇస్మాయిల్ (40) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలియగానే నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చీర్ల రాధయ్య, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు నడుపల్లిలోని ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పార్టీకి ఎనలేని సేవ చేసిన ఇస్మాయిల్‌ను చిన్న వయసులో చనిపోవడం పార్టీకి తీరని నష్టమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. రెండు రోజుల క్రితం నడుపల్లి పర్యటనకు వచ్చిన తనను ఆప్యాయంగా పలకరించిన ఇస్మాయిల్ ఆకస్మాత్తుగా ఈ లోకం నుంచి వెళ్లిపోవడం తనను ఎంతగానో కలచి వస్తోందని శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కాగా ఇస్మాయిల్ వృత్తి రీత్యా రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్ఎంపీ). ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఇస్మాయిల్ మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, నడుపల్లి సర్పంచ్ బీర సత్యవేణి రాజు, అన్నమరెడ్డి రవీంద్రనాథ్ చౌదరి, కానూరు, నడుపల్లి, నడుపల్లికోట, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



షేక్ ఇస్మాయిల్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, చీర్ల రాధయ్య తదితరులు

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంకకు చెందిన షణ్ముఖ బాలు (24) అనే యువకుడి మృతదేహం గోదావరిలో లభ్యమైంది. విజ్జేశ్వరం సమీపంలోని లంక ప్రాంతంలో సోమవారం అతడి మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. చేపల వేటకని ఆదివారం తెల్లవారుజామున ఆ యువకుడు ఇంటి నుంచి బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ అతడు గోదావరి నదిలో జారిపడి గల్లంతయ్యారు. అతడికి వరుసకు సోదరి అయిన పీతల ఆశాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలు అదృశ్యం అయినట్టుగా ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం శివారు మద్దూరు వంతెన వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నిడదవోలు ఎన్టీఆర్ కాలనీకి చెందిన గండేపల్లి సతీష్, వెలిచేటి పవన్ అనే వారు బైక్‌పై విజ్జేశ్వరం వెళుతూ ఈ ప్రమాదం బారిన పడ్డారు. తీవ్ర గాయాలైన సతీష్‌కు నిడదవోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తుండగా, పవన్‌ను అత్యవసర వైద్య సేవల నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథలకు భోజనం

నల్లజర్ల: విద్యాదాత, మాజీ ఎమ్మెల్యే చావా రామకృష్ణారావు నాలుగో వర్ధంతిని నల్లజర్లలోని అనాథ పిల్లల వసతి గృహం ఆనంద నిలయంలో సోమవారం నిర్వహించారు. ఏకేఆర్జీ విద్యా సంస్థల చైర్మన్ చావా గోఖుల్, కరస్పాండెంట్ వల్లమూడి రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం భోజన ఏర్పాట్లు చేశారు. నిడదవోలు శివారు తిమ్మరాజుపాలెంలోని వృద్ధాశ్రమంలో కూడ చావా వర్ధంతిని నిర్వహించారు.

సుజిత వైద్యానికి మరికొందరి సాయం



సుజిత తల్లికి నగదు అందిస్తున్న జిల్లా అరుంధతీయ సంఘం సభ్యులు

తాళ్లపూడి: తీవ్ర అనారోగ్యంతో కోమాలో ఉన్న మండలంలోని అన్నదేవరపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని కొలూరి సుజిత వైద్య ఖర్చుల నిమిత్తం మరో ఇద్దరు దాతలు సోమవారం ఆర్థిక సాయం చేశారు. గోపాలపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల రామతిరుపతిరెడ్డి తనయుడు, యువ పారిశ్రామికవేత్త హర్షవర్ధన్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఆయన సుజిత తల్లికి అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. అందించాలని అలాగే జిల్లా అరుంధతీయ ఉద్యోగుల సంఘం వారు రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. వారు రాజమహేంద్రవరంలో సుజిత చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి ఆ మొత్తాన్ని ఆమె తల్లికి అందించారు.కార్యక్రమంలో కొడమంచిలి సత్యనారాయణ, బొల్లిపో మధుశేఖర్, గెల్లా రాజు, మెరిపో సూరిబాబు, జలమయ్య, బొల్లిపో గోపీనాథ్ పాల్గొన్నారు.

18న ఉండ్రాజవరంలో బీఎస్పీ బహిరంగ సభ

పెరవలి: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉండ్రాజవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేన్ తెలిపారు. పెరవలిలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రసేన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు పట్నాల విజయ్ కుమార్, ఏలూరి అశోక్ కుమార్ నల్లి రమేష్, బయ్యే మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో వేగంగా ఇళ్ల నిర్మాణం



దేవరపల్లిలో జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులు సొంతంగా గృహ నిర్మాణాలు చేట్టారు. బేస్‌మెంట్ వేసిన లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం రూ.70 వేల చొప్పున జమ చేస్తోంది. దీనితో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు వస్తున్నారు. నియోకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వం 20 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేసింది. దేవరపల్లిలోని జగనన్న మోడల్ కాలనీలో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కాలనీలో ఇప్పటి వరకూ 1500 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయగా, ప్రభుత్వం గృహాలను మంజూరు చేసింది. కాలనీలో ప్రస్తుతం 100 గృహాల నిర్మాణం జరుగుతోంది. కొత్త సంవత్సరంలో గృహ ప్రవేశాలు చేయాలనే లక్ష్యంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు. గ్రామ పంచాయతీ విద్యుత్, నీటి సదుపాయం కల్పించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మూడు ప్రదేశాల్లో నీటి తొట్టెల నిర్మాణం చేస్తున్నారు.